క్లుప్తంగా

మత్తమాల పీహెచ్‌సీ ఇంటర్నల్ ఆడిటింగ్



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ఇంటర్నల్ ఆడిటింగ్ శనివారం జరిగినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ తెలిపారు. లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారులు సూపరింటెండెంట్ అమరేష్ రికార్డులను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులున్నారు.

ముగిసిన టీచర్ల వృత్యంతర శిక్షణ



కామారెడ్డి అర్బన్: నేర్చుకున్న విషయాలను తరగతి గదిలో అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో ప్రమాణాలు మెరుగవుతాయని గణిత శిక్షణ కోర్సు సమన్వయకర్త నరహరి రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 13 నుంచి నిర్వహిస్తున్న వృత్యంతర 5రోజుల గణిత శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ మాట్లాడుతు.. ఉపాధ్యాయులకు శిక్షణ అనేది విద్యాప్రమాణాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గణిత ఫోరం ప్రతినిధులు రామారావు, వి.శ్రీనివాస్, కుమారస్వామి, గోవర్ధన్, నరేందర్, వేణుగోపాల్, ఫోరం ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



బీబీపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం బీబీపేటలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఇళ్లలోకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను కాపాడాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నర్సరీలో ఉన్న ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శనివారం నస్రుల్లాబాద్ నర్సరీని ఆయన పరిశీలించారు. కవర్లలో విత్తనాలు నాటి మొక్కలను నాటాలన్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును సందర్శించి రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా అప్లికేషన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, ఎంపీవో రమణ, జీపీ కార్యదర్శి రాజేశ్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్‌లో మండల కేంద్రంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవీందర్‌రెడ్డి అందించారు. హసన్‌పల్లి, మహమ్మద్ నగర్ గ్రామాలకు చెందిన నలుగురు బాధితులకు చెక్కులను అందజేశారు. పార్టీ నాయకులు రమేష్‌యాదవ్, నాగబూష ణం గౌడ్, ఆకాష్, తోట. రాజు, కుమ్మరి. రాములు తదితరులున్నారు.

కుటుంబ స్నేహితలో పలు జంటలకు కౌన్సిలింగ్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కుటుంబ స్నేహిత కార్యక్రమంలో పలు జంటలకు పోలీసు సిబ్బంది కౌన్సిలింగ్ నిర్వహించారు. భార్యభర్తల మధ్య జరిగిన తగాదాలకు సంబంధించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించగా రెండు జంటలు ఏకమైనట్లు షీటీం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది శ్రీనివాస్, సుప్రజ తదితరులున్నారు.

మొరం పోశారు.. పనులు వదిలేశారు

- ముత్యంపేట నుంచి దోమకొండ వరకు నిలిచిన డబుల్ రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

దోమకొండ : కామారెడ్డి మండలం క్యాసంపల్లి నుంచి దోమకొండ మండల కేంద్రం వరకు చేపట్టిన డబుల్ రోడ్డు పనులు ముత్యంపేట వరకు పూర్తి చేసి వదిలేశారు. ఈపనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్లాన్ వర్క్ కింద రూ.20 కోట్లను కేటాయించింది. అప్పటి ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ పనులను ప్రారంభించారు. ముత్యంపేట నుంచి దోమకొండ వరకు 5 కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముత్యంపేట నుంచి దోమకొండ మండల కేంద్రం వరకు రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోసి వదిలేశారు. వర్షానికి రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమకొండ నుంచి ముత్యంపేట మీదుగా కామారెడ్డి వరకు గతంలో సింగిల్ రోడ్డు ఉండగా దానిని డబుల్ రోడ్డుగా మార్చి పనులు ప్రారంభించారు. ఈపనులు ముత్యంపేట గ్రామం వరకు మాత్రమే పూర్తి చేశారు.



దోమకొండ శివారులో రోడ్డుపై మొరం పోసి వదిలేసిన దృశ్యం

మండల కేంద్రం నుంచి ముత్యంపేట మీదుగా కామారెడ్డికి వెళ్లడానికి దూరం తగ్గుతుంది. దీంతో దోమకొండతో పాటు బీబీపేట ప్రాంతానికి చెందిన మండలాల ప్రజలు ముత్యంపేట నుంచి కామారెడ్డికి దూరం తగ్గుతుందని ఈ దారివెంట ప్రతినిత్యం వెళ్తుంటారు. పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు

మండలంలోని ముత్యంపేట గ్రామం నుంచి దోమకొండ వరకు డబుల్ రోడ్డు బీటీ పనులు అంసపూర్తిగా నిలిచిపోయిన మాట వాస్తవమే. ఈ విషయంలో జిల్లా ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడతాను. నిధులు లేక పనులు నిలిపివేసినట్లు గతంలో అధికారులు తెలిపారు. ఈ విషయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు దృష్టికి తీసుకువచ్చింది. – ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, దోమకొండ

ఆటోడ్రైవర్ల షెడ్ తొలగింపుపై ఆగ్రహం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి బస్టాండ్ ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ఆటోడ్రైవర్ల షెడ్‌ను మున్సిపల్ సిబ్బంది తొలగించడంపై ఆటోడ్రైవర్లు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటోలను నిలిపేందుకు నీడ కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్‌ను అధికారులు తొలగించడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు సక్రమంగా నడవకపోగా ఇబ్బందులు పడుతున్న తమకు అడ్డా లేకుండా పొట్టకొడుతున్నారని వాపోయారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్‌ను వివరణ కోరగా బస్టాండ్ నుంచి వెనక వైపు వెళ్లేదారిలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయన్న ఫిర్యాదు మేరకు వారికి నోటీసులు జారీ చేశామన్నారు.



పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



భిక్కనూరు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సురేందర్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఆట వస్తువులను పరిశీలించి దివ్యాంగులతో ముచ్చటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు దివ్యాంగులైన తమ పిల్లలను పునరావాస కేంద్రాలకు తీసుకవచ్చి ఫిజియోథెరపి చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట డీపీఎం రమేశ్‌బాబు, ఏపీఎం శ్రీనివాస్, సీసీ హరిలాల్ ఉన్నారు.

రక్తపోటుపై అవగాహన

భిక్కనూరు/రామారెడ్డి : భిక్కనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉప్పల్‌వాయి ఆరోగ్య కేంద్రాల పరిధిలో అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది రక్తపోటు లక్షణాల నివారణ చర్యలను వైద్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాళ్లు యెమిమా, దివ్య, వైద్యుడు సురేశ్, ఎంపీహెచ్‌ఈవోలు రమ్యశ్రీ, వెంకటరమణ, సూపర్‌వైజర్ సతీశ్, స్టాఫ్ నర్సు హరిత, ఫార్మసీ ఆఫీసర్ స్వామి, ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

- భూమి పూజ చేసిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బిచ్కుంద(జుక్కల్): ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం బిచ్కుందలో ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో నియోజక వర్గంలో 3,500 ఇళ్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద గుండెకల్లూర్‌లో ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇళ్ల నిర్మాణాలకు బిల్లులకు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి మండల కేంద్రంలో రూ. 5 లక్షలతో మోడల్ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, నమూనాలో నిర్మించుకుంటే రూ. 5 లక్షలలో నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం మార్కెట్ యార్డులో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జునప్ప షెట్కార్, ఏఎంసీ చైర్‌పర్సన్ కవిత, వైస్ చైర్మన్ శంకర్ పటేల్, ఎంపీడీవో గోపాల్, నాయకులు విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దర్పల్ గంగాధర్, గోపాల్‌రెడ్డి, నాగ్‌నాథ్ పటేల్, రవి పటేల్,మెక్కా మసూద్, ఖలీల్ పాల్గొన్నారు.



బిచ్కుందలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం

మద్నూర్(జుక్కల్): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని, ఒక్కొక్కటిగా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని రాచూర్ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బీటీ రోడ్డు కోసం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్యాంకులను శుభ్రం చేసిన జీపీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో పాకురు పట్టిన ట్యాంకులను శనివారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ శుభ్రం చేయించారు. 'ట్యాంకులకు పాకురు' అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారులు గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకులకు ఉన్న పాకురును తొలగించి శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ కలిపారు. ట్యాంకులకు గత కొన్నేళ్లుగా ఉన్న పాకురును పంచాయతీ అధికారులు శుభ్రం చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



కిష్టాపూర్‌లో పాకురు పట్టిన మినీ ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట/తాడ్వాయి/బీబీపేట/గాంధారి/సదాశివనగర్/నాగిరెడ్డిపేట : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శనివారం పలు చోట్ల అధికారులు మార్కింగ్ ఇచ్చారు. అనంతరం వారికి మంజూరు పత్రాలు అందజేశారు. ఎల్లారెడ్డి మండలం మీసాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రకాశ్ పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందించారు.లింగంపేట మండలం కొర్పోల్, బాణాపూర్, పొల్కంపేట, పర్మళ్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో నరేష్ మార్కింగ్ ఇచ్చారు. అలాగే బాణాపూర్ గ్రామంలో డీఆర్‌డీవో సురేందర్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు నందివాడ, ఎండ్రియాల్, చందాపూర్, బ్రాహ్మణపల్లి, ఎర్రాపహాడ్, చిట్యాల తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు మార్కింగ్ చేశారు.బీబీపేట మండలం ఉప్పర్‌పల్లి, శేరిబీబీపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేశ్, అధికారులు ముగ్గు పోశారు. గాంధారి మండలం బూర్గుల్, నేరల్ తండా, దుర్గం గ్రామాల్లో ఇందిరమ్మ నిర్మాణాలకు ఎంపీడీవో రాజేశ్వర్ ముగ్గు పోశారు. సదాశివనగర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎంపీడీవో సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగారెడ్డి మంజూరు పత్రాలను అందించారు. నాగిరెడ్డిపేట మండలం పోచారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపీడీవో ప్రభాకరచారి కాంగ్రెస్ నాయకులతో కలిసి మార్కింగ్ ఇచ్చారు. గ్రామంలో మొత్తం 16మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు పంచాయతీ కార్యదర్శి తిరుపతి తెలిపారు. వారిలో 9 మందికి సంబంధించి ప్రస్తుతం ప్రొసిడింగ్ లెటర్లు వచ్చాయని ఆయన చెప్పారు. దీంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమిపూజ సైతం చేశారు.కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సందీప్, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయి మండలం చందాపూర్‌లో ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

పేదల సొంతింటి కల సాకారం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి

భిక్కనూరు/రాజంపేట : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పట్టాలను అందజేశారు. రాజంపేట మండలం తలమడ్ల, ఆరేపల్లి గ్రామపంచాయతీల పరిధిలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, రాజంపేట ఎంపీడీవో రఘురాం, జీపీ కార్యదర్శి ప్రశాంత్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాదవ రెడ్డి, కాంగ్రెస్‌నేతలు, తదితరులు పాల్గొన్నారు.



ఆరెపల్లిలో లబ్ధిదారులకు ఇళ్ల మంజురు పత్రాలను అందిస్తున్న చంద్రకాంత్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. పార్టీ నాయకులు నాగభూషణంగౌడ్, రమేష్‌యాదవ్, మల్లయ్యగారి ఆకాష్, తోట. రాజు, కుమ్మరి రాములు, హరీన్, గోవీర్‌గుప్తా, తదితరులున్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు ప్రశంస పత్రాల అందజేత

కామారెడ్డి టౌన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రశంస పత్రాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో 500లకు పైగా మార్కులకు వచ్చిన విద్యార్థులకు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జోన్ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు సాయి,అజయ్, డేవిడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీని బూత్ స్థాయిలోకి వెళ్లేలా కృషి చేశారు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు సున్నం సాయిలు సేవలు మరువ లేనివని మండల ప్రధాన ఖార్యదర్శి మేకల రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓకల్యాణ మండపంలో జరిగిన సమామేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పార్టీని ప్రతి గ్రామానికి ,బూత్ స్థాయిలోకి వెళ్లేలా కృషి చేశారన్నారు. అనంతరం సున్నం సాయిలును సన్మానించారు.

అంబేద్కర్ విగ్రహ పనులు పూర్తి

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులు దాదాపు పూర్తయ్యాయని దళిత నాయకులు బంగారు మైసయ్య, నర్సింహులు, మన్నె సాయిలు తెలిపారు. శనివారం వారు గ్రామంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. బేగరి సాయిలు, పోతరాజు సాయిలు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని మాతశిశు ఆస్పత్రిలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ రావు తెలిపారు. వేసవి కాలం మూలంగా మాతాశిశు ఆస్పత్రిలో రక్తనిల్వలు తగ్గిపోవడంతో గర్భిణీ, బాలింతలకు రక్తం అందుబాటులో ఉంచడానికి శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రక్తదానంపై ఆసక్తి ఉన్న వారు 73869 65601 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లకు మొబైల్ యాప్ ఎందుకు..?

భిక్కనూరు: ఇందిరమ్మ ఇళ్లకు మొబైల్ యాప్ ఎందుకు పెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు ప్రశ్నించారు. శనివారం ఆయన భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ యాప్ ఆప్‌లోడ్‌తో లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నేతలు వాజీద్, రైమా, షమీమా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకోసం దరఖాస్తు చేసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గోపాల్‌పేటలో గల తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. తమ కళాశాలలోని ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులున్నాయని, ప్రతి గ్రూపులో 40చొప్పున సీట్లు ఉన్నాయని ఆయన చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మందుబాబుల వీరంగం



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని ప్రభుత్వ బాలర, బాలికల ఉన్నత పాఠశాలల్లో మందుబాబులు వీరంగం సృష్టించారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని గదుల్లోకి చొరబడి మద్యం సేవించి గదుల్లో ఉన్న విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలను, బెంచీలను బయట పడేశారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఊర పండుగకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను శనివారం కలిశారు. ఈనెల 24, 25 తేదీలలో తాడ్వాయిలో జరిగే ఊర పండుగకు రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. వీడీసీ చైర్మన్ మేకల రాజు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, గ్రామపెద్దలు మహేందర్ రెడ్డి, సంజీవులు. వీడీసీ సభ్యులు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఆలయ అభివృద్ధికి రూ.28 వేలు విరాళం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ తుమ్మల వేణుగోపాల్ రావు, శిఖర రాంచంద్‌ల తరపున ఫ్యాక్టరీ అధికారులు డి.బాల్‌రాజు, దామోదర్‌రెడ్డి, రామకృష్ణలు శనివారం ఆలయ సిబ్బందికి రూ.28 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది వారికి తీర్థప్రసాదాలు అందించారు.

ఆంజనేయ ఆలయంలో వైశాఖ చందన పూజ



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో శనివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి వైశాఖ చందన పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రవికాంత్ చారి ప్రత్యేక పూజలు చేపట్టారు. పంటలు సమృద్ధిగా కురువాలని స్వామి వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు తోట సంగమేశ్వర్, దుబాసి నర్సింలు, తేలు రాములు, నరహరి, నరేష్, ఆకుల మోహన్, అనిల్, ఆంజనేయులు, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ముక్కుపుడకల సమర్పణ...

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి పార్వతి అమ్మవార్లకు గ్రామానికి చెందిన బండారి శోభన్‌రెడ్డి–మంగమ్మ దంపతులు మూడు బంగారపు ముక్కుపుడకలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. గ్రామశివారులోని దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు, సోమవారం రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



కామారెడ్డి అర్బన్ : స్థానిక పశ్చిమ హౌసింగ్‌బోర్డు కాలనీలోని గణపతి ఆలయంలో శుక్రవారం రాత్రి వేదపండితులు జి.అంజనేయశర్మ ఆధ్వర్యంలో సంకష్టహర చతుర్థి గణపతి ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు సంపత్‌కుమార్ శర్మ, కమిటీ ప్రతినిధులు అంజయ్య, రవీందర్‌గౌడ్, విశ్వం, ఎంబరి లింగం తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టూ తిరుగుతూ భక్తులు చావ తీశారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



దోమకొండ: మండల కేంద్రంలో పలుగుగడ్డ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. మండలానికి చెందిన ఎనిమిది జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు నరేశ్, ప్రవీణ్ తెలిపారు. టోర్నమెంట్‌ను మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన మొదటి జట్టుకు రూ. 5555, రెండవ జట్టుకు రూ.3333 బహుమతిగా అందిస్తామని వారు వివరించారు.